కథా నిలయం
5452



# పునర్జన్మ



తను బస్‌లో ప్రయాణిస్తున్నప్పుడల్లా తననెవరో తదేకంగా చూస్తున్నారని అనుమానం కలిగింది సంగీతకు. ఓసారి నాలుగువేపులా చూసింది గాని బస్సులోని వారంతా యెటో చూస్తూ కనిపించారు. బస్ దిగినప్పుడూ, తరవాత గూడా అలాగే తోచింది. తను దిగిన చోటే దిగుతున్నాడామనిషి. తాను పట్టిన దోవే పడుతున్నాడు. అదే ఫుట్‌పాత్. మరో బస్ అందుకోవాలి. బస్ స్టాప్‌లో నిలబడి క్రీగంట చూసింది. యెవరో అపరిచితుడు తన వంక చూస్తూ కంటబడ్డాడు. బస్‌కోసం యెదురు చూడటం లేదల్లే వున్నది. యెలా ఫాలో అవుతాడు? యెలా తెలుసుకుంటాడూ?

సిటీలో కొత్తగా డబుల్ డెకర్ నడుస్తున్నది. అందులో యెక్కింది సంగీత. పై అంతస్తు కెళ్ళింది. ఖాళీ సీటు కనబడంగానే ఆక్రమించింది. హాండ్ బాగ్ తీసి చూసుకున్నది బస్ ఫేర్ కోసం, చిన్న పర్స్ విప్పి చిల్లర తీసి పట్టుకున్నది. పర్స్ హాండ్‌బాగ్‌లో వుంచి జిప్ మూసింది. అప్పుడు తలెత్తి చూసింది.

నవ్వుతున్నాడెదురు సీటులో మనిషి. వెల గల సూటు. కళ్లజోడు నల్లని క్రాపు, ఖరీదైన అందమైన మెరిసే బూట్లు, మేజోళ్లు, నెక్ టై, మెరుస్తున్న నల్లని కళ్లు. చనువుగా అడిగాడు. ''షాపింగ్‌కి వెళ్తున్నారా? నేనూ అందుకే బయలుదేరా. రిస్ట్ వాచ్. పార్కర్ పెన్ కొనాలి. వాచీ గొలుసు వదులై యెక్కడో జారిపోయింది. రద్దీగా వున్నాదానాడు బస్సులో. చూసుకోలేదు. పెన్ సరిగా వ్రాయటం లేదు. ఇంక్ ఫ్లో కావటం లేదు. తెల్లగా వ్రాస్తున్నది''.

''మిస్టర్ ! సారీ! మీరు పొరబడ్డారేమో. మనిషిని పోలిన మనుషులుంటారు. హాలివుడ్ యాక్టర్ ట్రావోల్టా పోలికలు గల అబ్బాయిని యీ సిటీలోనే చూశాను. మైండ్ యువర్ ఓన్ బిజినెస్. నేనెక్కడికెళ్తున్నదీ యెందుకెళ్తున్నదీ మీ కనవసరం'' అంటున్న సంగీత బస్ స్టార్ట్ కావటం గమనించనే లేదు. బెదిరిపోయిందంతగా. మళ్లా యేదో స్టాప్ వచ్చినట్టున్నది. లేచి హైహీల్సు టకటకా చప్పుడు చేస్తూ వెళ్లిపోయింది. స్టార్ట్ అయిన బస్ కిటికీలోంచి చూశాడు. సంగీత ఆటో అందుకుని యెక్కింది. ఆటో కదిలిపోయింది.

2

సంగీత హాల్లో ప్రవేశించేసరికి ఆట మొదలైంది. సంగీత అడ్వాన్సుగా టికెట్ తీసుకుని, షాప్ కెళ్లి రిపేరైన వాచీ తెచ్చుకుని వచ్చింది. గేట్ కీపర్ టికెట్ చూసి, టార్చ్ వేసి వెంట బెట్టుకెళ్లి సీటు చూపించి వెళ్లిపోయాడు. సంగీత సద్దుకూర్చుని సినిమా చూసింది. ఇంటర్వెల్ వచ్చేదాకా తలతిప్పన్నా చూడలేదు అంత బావున్నది సినిమా. విశ్రాంతి అని చూపుతూ లైట్లు వెలిగినై. అప్పుడు పక్కకి చూసింది. అదే మనిషి. ఇవ్వని చనువు తీసుకుంటూ నిలబడి అడిగాడు.

''రండి. అలా వెళ్లి యేవన్నా బావుంటే తినివద్దాం. యేమీ లేకపోతే కోలా తాగి పాప్‌కారన్ పొట్లం తెచ్చుకుందాము''. వెనక వారి కడ్డంగా వున్నాడు.

థియేటర్లో తగువేమిటని సంగీత లేచింది.

బయట వరండాలో వేడి వేడి బోండా, సమోసాలు అద్దాల పెట్టెలోనించే ఆహ్వానించాయి. అతనే కొన్నాడు. బోండా, సమోసా, పచ్చడి, పేపర్ ప్లేటులో వేసిమ్మని తెచ్చి సంగీత కందించాడు. అతనూ తెచ్చుకున్నాడు. మెల్లిగా పూర్తి చేశారు. చాలా రుచిగా వున్నాయి. కుండీలో పేపర్ ప్లేట్ పడేసి వచ్చేప్పటికి ఐస్‌వాటర్ గ్లాస్ అందించాడు. మంచి నీళ్లు తాగి కుండీలో చేయి కడుక్కుని గ్లాసిచ్చేసింది. కర్చీఫ్‌తో మూతి అద్దుకుంటుండగా లిమ్కా మూత తీయించి స్ట్రా వేసి తెచ్చిచ్చాడు. అపుడు ఖాళీ కుర్చీలు గోడవారగా కనబడితే ఆక్రమించారిద్దరూ. డ్రింక్ పూర్తి చేస్తూ అడిగాడు.

''బావుందా సినిమా? తోడెవరూ రాలేదూ? కొలీగ్? రెలెటివ్? ఫ్రెండ్? ఒంటరిగా తిరుగుతారేం? అదంత మంచి పద్ధతి గాదు'' నవ్వుతూ చూస్తున్నాడు సంగీతని.

''మీరు అంగరక్షకునిలాగా నా వెంట వుంటారు గదా అని తోడు అనవసరమనుకున్నాను. యెవర్నడిగినా నా చేత డబ్బు వదిలించేవారే. డీసెన్సీ వుండదు. అనుభవంమీదే చెప్తున్నా'' అని లేచింది.

''కూచోండి. యింకా పిక్చర్ బిగిన్ కాదు. ట్రయల్సూ, ప్రకటనలూ కావద్దూ? తర్వాత అసలు సినిమా'' అన్నాడు.

సంగీత కూచోలేదు. వదలని జిడ్డును చూసినట్టు విచారంగా చూసి ఖాలీ సీసా యిచ్చేసింది. అతను లేచి డబ్బు చెల్లించి వచ్చేప్పటికి, వెయిట్ చేయకుండా లోపలికి వెళ్లిపోతున్నది. లోపల డిమ్‌లైట్లు. మళ్లా పక్కపక్కనే కూచున్నారిద్దరూ.

''విదేశాల్లో యిద్దరిద్దరు కనబడతారు యెక్కడ చూసినా. కొంతమంది బిడియపడకుండా ఒకళ్లమీది కొకరు ఒరుగుతూ కనిపిస్తారు. మరోచోట మధ్య యువతీ రెండు వేపులా ఆమె చేతులు పట్టుకుని యువకులూ చెట్టాపట్టాలేసుకు నడుస్తూ కనిపిస్తారు. ఒక్కరూ తిరగటం నాగరికత కాదు'' అంటూ నవ్వుతున్నాడు.

''సినిమా చూడటానికి రాలేదేమో''అనుకున్నది సంగీత.

''అధిక ప్రసంగం చేస్తున్నారు మిస్టర్. విదేశంలో అన్నీ వూరికేనే జరిగిపోతాయనీ, లా వుంటుందనీ ఒక ఫ్రెండ్ చెప్పింది. అదీ దిలాసా. టైసన్ అంతా కోల్పోయాడు. చాప్లిన్ అంతా కోల్పోయాడు. జుట్టుగూడా తెల్లగా తెల్లబడిందట. చిన్నవాడే కోల్పోయేనాటికి. చూస్తే మీకు వాళ్ల ఆచారాలు నచ్చినట్టున్నాయి. విదేశం వూరేగివచ్చారా?'' అడిగింది సంగీత.

నవ్వుతూనే జవాబిచ్చాడు ''వచ్చాను''.

''వెంటేసుకు తిరగటానికి అక్కడెవరూ కోమలాంగి అందలేదూ?''

''అందింది మేడమ్. మన దేశం రానన్నది. ఒక్కడినే తిరిగి వచ్చాను'' అన్నాడు నొచ్చుకోకుండా.

''మీరు ప్రపోజ్ చేయలేదు కాబోలు. మీ జాతికదో తెగులు. ఇండియాలో తప్పుపడ్తారనీ గౌరవం దొరకదనీ రాలేదు గాబోలు. నా సహాధ్యాయి జపాన్ స్కాలర్‌షిప్ మీద వెళ్తే అదృష్టవశాత్తూ అక్కడే వుద్యోగం లభించింది. ఒక సుందరవనితా రత్నమూ అందింది. అతనికి స్వదేశం మీదే వున్నది. రిజైన్ చేసి

వస్తూ ఆ వనితను పెళ్లాడి వెంటబెట్టుకొచ్చాడు. మీకలా చేయటానికి గుండెల్లేవేమో'' అని నవ్వింది సంగీత.

''థాంక్యూ. నవ్వారెలాగైతేనేం. యెప్పుడూ బొమ ముడి పడుతూనే వుంటుంది. మిమ్మల్ని అడుగుతున్నాను మేడమ్. మీరు చేసుకుంటారా నన్ను'' అని తీయగా నవ్వుతూ అడుగుతుండగా చిత్రం మొదలై, లైట్లు పోయినై. కథ సాగుతున్నది తెరమీద ఆటాపాటా బావున్నది. ఇద్దరూ మౌనంగా చూశారు.

చిత్రం ముగిసింది. లైట్లు వెలిగినై. అందరూ లేచి వచ్చేస్తున్నారు. చూస్తే సంగీత లేదు.

3

బాంక్‌లో సంగీత కాషియర్ అందించిన నోట్లకట్ట అందుకున్నది. దాపులనే వున్న బెంచ్ మీద కూచుని లెక్కించింది. హాండ్ బాగ్‌లో భద్రం చేసి జిప్ లాగి, బుజానికి వేలాడేసుకుంటూ లేచింది.

తానూ పని ముగించుకుని వస్తున్నాడు. నవ్వుతున్నాడు. ఖద్దర్ సిల్క్ లాల్చీ తెల్లనిది. కంఠె మెడ. మెరిసే గుండీలు. చాక్‌లెట్ రంగు చెప్పులు. దువ్విన తల. కుడిచేతిలో తోలుసంచీ పట్టుకుని వస్తూ నిలబడిపోయాడు.

''చెప్పకుండా వెళ్లిపోయారేం మేడమ్ ! చిత్రం ముగిశాక చూస్తే లేరు. విశ్రాంతి తర్వాత పిక్చర్ చూడనే లేదా? నేనడిగిన మాటకి హర్ట్ అయారా? నెగెటివ్ రిప్లై యివ్వచ్చునే. వెళ్లిపోవటమెందుకూ? హాలు బయట కనబడతారేమోనని అందర్నీ పరిశీలనగా చూసినా మీరు కంటబడలేదు'' నవ్వుతున్నాడు.

సంగీత నిలబడిపోయింది. ''గాలం వేశాడే'' అనుకున్నది.

''పోదామా?'' అన్నాడు.

మారుమాటలేక అనుసరించింది. అది బాంక్. అందరూ చూస్తున్నారు. గేటు దాటి వచ్చారిద్దరూ. చూస్తే సరికొత్త ఆటో. డ్రైవర్ నిలబడి వున్నాడు. పక్కన కూచోవాలేమో అని చూసింది.

''మీరు ఆఫీసరనుకున్నాను సుమండీ ! కారులో రాలేదూ?''

''రాలేదు మేడమ్. ఈ మాటు వస్తాను. నాకు డ్రైవింగ్ రాదు. కాని కారు మెకానిజమ్ చదివాను. మీకిబ్బందిగా వుంటే నేను డ్రైవర్ పక్కన కూచుంటా. మీరు వెనక సీటులో కూచోవచ్చు'' అంటున్నాడు. డ్రైవర్ అడ్డం తొలిగాడు.

బాంక్‌లోనించి మరొక కస్టమర్ వచ్చింది. రెండో రిషా అక్కడెక్కడా లేదు.

''మీరా! త్రివిక్రమ్. నేను యేజెంట్‌తో మాట్లాడుతూ రూల్సు తెలుసుకుంటూ ఆఫీస్ రూమ్‌లో వున్నా. అద్దాల తలుపులున్నా మీరు నన్ను గమనించలేదు. ఈ అమ్మాయి యెవరూ? గుడ్ లుకింగ్. వయస్సూ తక్కువల్లెనే వున్నది. డ్రా చేయటానికి వచ్చారా?'' అన్నది నిలబడి.

''లేదు డాక్టర్. జమ కట్టటానికే వచ్చాను. పోదామా. రండి'' అని వాచీ కన్సల్ట్ చేశాడు. ''పన్నెండు దాటింది. భోజనం వేళ అయింది. దసపల్లాలో లంచ్ కానిచ్చి వెళ్దాం'' అని ఆటోలో దూరబోతున్నాడు.

''చిటచిటలాడుతున్నదేం యంగ్ లేడీ! హర్ట్ చేశారా?'' డాక్టర్ విక్టోరియా నవ్వుతూ ఆటోవేపు నడిచింది. సిల్క్ చీర, సన్నని అంచు స్కైబ్లూ. మైసూర్ జార్జెట్. అదే రంగు బ్లౌజ్. అందమైన హాండ్ బాగ్. పొడులున్న ఇయర్ రింగ్స్. వేలికి రవ్వ వుంగరం. హైహీల్స్. బాబ్డ్ జుట్టు చిక్కగా వుండి బుజాల మీద పడుతున్నది.

''లేదు డాక్టర్. మంచి ఆకలి మీదున్నప్పుడు, మంచి చెప్పినా కోపమొస్తుంది. ఆత్మారాముడు చల్లబడాలి'' అన్నాడు.

డాక్టరు, సంగీతనెక్కమని సూచన చేసింది. సంగీత యెక్కి చివరికి జరిగింది. తర్వాత డాక్టరమ్మ యెక్కుతూ చూసింది.

''అదేమిటి త్రివిక్రమ్! డ్రైవర్ పక్కనెందుకు? అతనికి రూల్సు రావా? లేక మేనర్స్ చూపుతున్నారా? అదేం అవసరం లేదిప్పుడు. ఇలా వచ్చి కూచోండి'' అని ఆహ్వానిస్తూ చోటు చూపింది. సంగీతకి దగ్గరగా జరుగుతూ మళ్లా అడిగింది విక్టోరియా. ''మీరిద్దరూ సరదాగా వెళ్దామనుకుంటుంటే

పానకంలో పుడకలాగా నేనడ్డు పడ్డానా?'' అని నవ్వింది.

త్రివిక్రమ్ వచ్చి ఖాళీ చోటులో కూచుంటూ నవ్వుతూ అన్నాడు. ''థాంక్యూ డాక్టర్. ఇంకా పానకం వరకూ రాలేదు. పోనీవోయ్''.

అన్నిటికీ నవ్వుతాడు అని నోటీస్ చేసింది సంగీత. ఆటో బయలుదేరింది.

దోవ పొడుగునా వాళ్లిద్దరూ బాగా విసుర్లు విసురుకున్నారు. దసపల్లా ముందు దింపేసి ఆటో బాడుగ అందుకుని వెళ్లిపోయింది.

లోపలికెళ్లగానే సర్వర్ వచ్చి మంచి చోటు ముగ్గురు కూచునేది చూపి మెనూ ముందుంచి వెళ్లాడు. మరొక మనిషి రాగానే త్రివిక్రమ్ మెనూ చదివి ఆర్డరిచ్చాడు. వేడివేడి పదార్థాలు తింటూ కబుర్లాడుకున్నారు. పులావ్, వైట్ రైస్, కూరలు, దొండ, కాబేజీ, పప్పు, సాంబారు, చారు, గోంగూర పచ్చడి, అప్పడం, యెదురుగా జాడీల్లో నిమ్మ ఆవకాయ వూరగాయల్లో స్పూన్లున్నాయి.

డాక్టర్ నవ్వుతూ అడిగింది. ''మూగ నోమూ గట్రా వున్నాయ్యా యేమమ్మాయ్! యెన్నడూ లంచ్ మొహం యెరగనట్టు పదార్థాలే చూస్తూ తింటున్నావే? త్రివిక్రమ్ చాలా పార్టీలకీ, లంచ్‌లకీ, డిన్నర్లకీ యెటెండౌతారే. నిన్ను రావద్దన్నారా? తానే తరచూ పార్టీ యిస్తారే. దాని పేరిప్పుడు గెట్టుగెదరనుకో. నేను వేరే కేస్టనా! పేరు విక్టోరియా అయినా నేను హిందువునే. ఇంకా చెపితే బ్రామినే. పెళ్లికాడికొచ్చేప్పటికి ఫిరాయించాల్సి వచ్చింది. మీ ఆచారాలు వదులుకోనక్కర్లేదని విగ్రహారాధన మానుకోనక్కర్లేదని అనుమతించాడు భర్త. ఆ మాటకొస్తే వాళ్లు పఠాల్ని ఆరాధిస్తారనుకో. లోపల ఆరాధనంతా ఒకటే. లోకం కోసం ఫిరాయించానంతే. తర్వాత టూ లాయల్టీస్ యిబ్బంది తెచ్చిపెడతాయి. అక్బర్ దిగ్రేట్ దిన్ యిలాహీ అనే మతం స్థాపించాడుట. మొగుడి మతం మొగుడిది, పెళ్లాం మతం పెళ్లానిదీ. యెవరి ఆచారాలూ నమ్మకాలూ వారివీ. అయినా వాళ్లు భార్యా భర్తలుగా జీవించవచ్చునన్నాడు. కాని ఆ మతం నిలబడలేదు. అందుకని ఫిరాయింపే బెస్ట్''. విక్టోరియా తినటమై ఐస్‌క్రీమ్ కప్పు అందుకున్నది.

సంగీతా నవ్వింది. తానూ పూర్తి చేసి గులాబ్‌జామ్ గిన్నె అందుకున్నది. ''చాలా చదివారే డాక్టర్రై గూడా. మూగనోము కాదు గదా, మరే నోములూ వ్రతాలూ లేవు నాకు డాక్టర్! అసలు మతమూ, కులమూ అనేవే లేవనిపిస్తుంది నాకు మంచి మేనర్సూ మంచి స్వభావం గల వారన్ని మతాల్లోనూ, అన్ని కులాల్లోనూ కనిపిస్తారు. అవినీతికీ, అధార్మానికీ, అన్యాయానికీ వెరవని వారూ అలాగే వున్నారు. కన్యాశుల్కం అనే నాటకంలో చెప్పిందదే యిలా వున్నది మన సమాజం అని నందనార్ చరితం మరీ గొప్ప విషయం చెపుతుంది. రామానుజుని గురువెవరో తెలుసా మీకు?'' అన్నది సంగీత.

రసగుల్లా తింటూ సంగీత డాక్టర్నే చూస్తూ అన్నది.

''నేను యెక్కడ మోసపోతానో అని జాగర్తగా వుండాలని ఆలోచిస్తూ వుంటాను. అది మీరు నోము అనుకున్నారు''.

''పెళ్లి అంటే భయమా?'' అనడిగింది డాక్టర్.

''అవునండీ. పెళ్లి అనేది ఒక్కసారే జరుగుతుందని నా అభిప్రాయం. డైవోర్సివటం మళ్లా పెళ్లాడటం అదంతా యేదో బిజినెస్‌లాగా తోస్తుంది. పెళ్లికీ బిజినెస్‌కీ సంబంధం లేదని అనుకునేదాన్ని. కాని లోకం తీరు చూస్తుంటే వున్నట్లే కనబడుతున్నది సుమండీ. ఒకసారి బిజినెస్‌లోది గాక నష్టపోకుండా జాగర్తగా రన్ చేసుకోవాలని అనుకుంటాను. లోతుపాతులు తెలిసే దిగాలి బిజినెస్‌లోకి''.

''లా చదివావా?''

''లేదండీ''

''యేం చదివావూ?''

''యేదో పొట్టకూటికి జాబ్ చేయాలని చచ్చు సబ్జక్ట్‌తో పట్టభద్రురాలినైనా'' రసగుల్లా తింటూ అన్నది.

''యేదో విషయంలో చుక్కెదురైందేమో. ఇంకా కోలుకోలేదేమో'' అని డాక్టర్ మరో రసగుల్లా తింటున్నది.

''బాగా వూహించారు'' కప్పు అవతలికి నెట్టేసింది.

''యెక్కడైనా డిజప్పాయింట్ అయినా, 'సోవాట్?' అనుకుని మరోటి ట్రై చేయాలని అమెరికన్ల పద్ధతి''

''మీరు అమెరికా వెళ్లి వచ్చారా?''

అవునని తలూపింది డాక్టర్. తీపి పూర్తి చేస్తున్నది.

''వారి కల్చర్ బాగా నచ్చిందా?''

''అంత బాగా నచ్చలేదు. వాళ్లు లాని గౌరవిస్తారు, దాని ద్వారా గెలుస్తామని, గెలవగలమని నమ్ముతారు. డబ్బు వెంట పరుగెత్తుతున్నట్టు తోచింది నాకు. క్విక్ బక్ కోసం వెతుకుతూ కనిపించారు. ఫోర్డ్ ఫౌండేషన్ రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ వున్నాయనుకోండి. యెంపైర్ బిల్డింగ్ రన్ చేస్తున్నారనుకోండి''.

''ధనార్జనకీ షార్ట్ కట్ లేదు. మోక్షానికీ షార్ట్‌కట్ లేదు. అన్ని మతాల గురువులు తాము చెప్పిన మార్గమే మోక్షానికి దగ్గర దోవ అని నమ్మిస్తూ వుంటారు. పదిహేను లక్షలు సంపాదించే షార్ట్‌కట్ చూసి హత్య చేసి పట్టుబడ్డ వారున్నారు. కామిగాక మోక్షకామి గాడు అన్నాడు యోగి వేమన. జీవితంతో మొహం మొత్తి మోక్షం కోసం చూస్తాము''.

డాక్టర్ నవ్వి కర్చీఫ్‌తో మూతి అద్దుకున్నది.

''డీప్‌గా చదివినట్టున్నావు. లెంగ్తీ స్పీచెస్ యివ్వగలవు. మోసమనేది యే విషయంలో గ్రహించావూ?'' అన్నది సింపతీ చూపిస్తూ.

'పెళ్లి విషయంలో''

'' ఈ జన్మలోనే?''

''కాదు. క్రితం జన్మలో. మాయల ఫకీర్ బాలనాగమ్మను కుక్కగా మార్చినట్టు చేశాడు నన్ను. బందీఖానా కుక్క'' సంగీత మొహం యెర్రబడసాగింది.

''బుజావు చేయగలవూ?'' వినోదం కోసమే అడిగింది విక్టోరియా.

'' అ. నాకు టెలిపతీ వున్నది. అంతా గుర్తున్నది. అలా చేసిన మాయల ఫకీర్ యీ జన్మలో గూడా వెంటాడుతున్నాడే తప్పించుకోటమెట్లా అని ఆలోచిస్తూ వుంటాను''.

డాక్టర్ బాగా నవ్వింది సంగీత మాటలకి. '' ఈ జన్మలో గూడా వాడేనని గుర్తు పట్టావూ, యెవరు?''

'' అ. అ. గుర్తుపట్టా. మీ ఫ్రెండే. లంచ్ యేర్పాటు చేసినాయనే యెక్కడ చూశానీ మనిషినీ అని గుర్తు చేసుకుంటుండగా అంతా సినిమాలాగా కళ్లకు కట్టింది. నా చిన్నప్పుడు నేను దెబ్బలు తిని యేడుస్తుంటే నా స్నేహితులు నన్ను చూసి, ''అయింది అమ్మాయి గారి పెళ్లి'' అని నవ్వేవారు. మీకు పెళ్లి అయిపోయింది గనక మీకిక భయంలేదు డాక్టర్ !'' అని లేచి బాగ్ అందుకుని బుజానికి వేలాడేసుకుని భద్రంగా వున్నాదా లేదా అని చూసుకున్నది సంగీత, ''థాంక్స్ ఫర్ ది లంచ్'' అన్నది.

వెళ్లిపోతున్న సంగీత వేపే చూశారిద్దరూ. సంగీత తలుపు దాటాక త్రివిక్రమ్ వేపు చూసింది డాక్టర్.

'' ఆ అమ్మాయికి మతి సరీగ్గా వున్నదీ? దాని వెంటబడటమెందుకూ? అదట్లా నోరుపెద్దది చేసుకున్నదే?'' అనడిగింది.

''మతి సరీగ్గానే వున్నది డాక్టర్. ఇగోయే మోతాదు మించి పెరిగిపోయింది. దాన్ని దింపేయాలి బైహుక్ ఆర్ క్రుక్'' అంటూ నవ్వుతూనే లేచాడు త్రివిక్రమ్.

4

చేతులో కూరల సంచీ, బుజానికి వేలాడుతున్న సంచీలో పాల పాట్లాలు రెండూ, ఐస్ క్రీమ్ ప్యాకెట్, డాక్టర్ బిస్కట్స్ ప్యాకెట్, రెండు అరటిపళ్లు, రెండో చేతులో సంచీలో ప్రైవెట్ డ్రైక్లీనింగ్‌లో యిచ్చిన యిస్త్రీ చీరల ప్యాకెట్స్, అంచులు కుట్టమనీ, ఫాల్ కుట్టమనీ యిచ్చిన చీరలు నాలుగు జాకెట్లు మెండ్ చేయమన్నవి నాలుగు, లంగాలు కొత్తవి రెండున్న ప్యాకెట్ వున్నాయి. సంగీత బస్‌స్టాప్‌లో

నిలబడి ఆటోకోసం చూస్తున్నది. అది షెల్టర్. ఆటోలొస్తున్నాయిగానీ, నలుగురేసి వున్నారాటోల్లో. పావుగంట గడిచింది. వాచీ చూసుకున్నది సంగీత. యెనిమిదన్నర అయింది. పొద్దుబోతున్నది. అపార్ట్‌మెంట్ దూరం. లిఫ్టులో పైకిపోవాలి. వాచ్‌మన్ వుండాలి. తొమ్మిదౌతుంది. నించోలేకపోతున్నది సంగీత. ఒక మారుతీ కారు వచ్చి సంగీతకెదురుగా ఆగింది.

దాన్ని డ్రైవ్ చేస్తూ వచ్చిన రమణి కిటికీలోంచి తల బైటికి పెట్టింది. ''సంగీతా! నిలబడి వున్నావే. చాలా వున్నాయే సంచీలు. ఆటో రాలేదా? రా. నే దింపుతా'' అని పిలిచింది.

సంగీత పనిచేసే కంపెనీలోనే రమణి పనిచేస్తున్నది. సంచీలందుకుని వెనక సీట్లో భద్రం చేసింది రమణి. ఇద్దరూ ఫ్రంట్ సీట్లో కూచున్నారు.

రమణి స్లీవ్‌లెస్ బ్లౌజ్. లావణ్యం, తారుణ్యం తెలిపే జార్జెట్ చీర. బ్యూటీ పార్లర్ నించి వస్తున్నదని ఆమె మేకప్ చెపుతున్నది. హెరాయిల్ వాసనా. సెంట్ వాసనా. లోనెక్. సన్నని బంగారు గొలుసుకి అందమైన లాకెట్. చేతికి వాచీ, వేలికి ఉంగరం. కొత్త హైహీల్సు. గోళ్లకి రంగు కుడిచేతికి రాళ్లూ ముత్యాలూ పగడాలూ పొదిగి వున్న బంగారు గాజు.

నాలుగు రోడ్ల కూడలికి వచ్చారు. రెడ్‌లైట్ చూసి ఆపింది రమణి, మోటార్ రన్నవుతున్నది. ఇంకా హెవీ వెహికిల్స్ ఆటోలు, స్కూటర్లు, మోటారు సైకిళ్లు, గ్రీన్ సిగ్నల్ కోసం చూస్తున్నాయి. సిటీ బస్.

కుడివేపు కిటికీ నుంచి రమణి, స్కూటర్ మీదున్న త్రివిక్రమ్‌ని చూసింది. అతని ముందు మిత్రుడు కాలునేల కానించి సిగ్నల్ వేపు చూస్తున్నాడు.

యడమ చేయి చక్రం మీదే వుంచి పట్టుకుని, కుడిచేతితో రమ్మని పిలిచింది రమణి. ''విక్రమ్ బావా! ఇలా రండి''. త్రివిక్రమ్ నవ్వుతూ చూసి దిగాడు. స్నేహితుడి బుజం మీద తట్టి, ''నువు వెళ్లచ్చు'' అన్నాడు. అన్నీ తప్పించుకుంటూ వచ్చాడు. వెనక తలుపు తోసి ప్యాకెట్స్ నెట్టి కూచుని తలుపు మూశాడు. గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కారు బయలుదేరింది. ముందున్న చిన్ని అద్దంలో చూస్తూ

అడిగింది రమణి. ''యెక్కడికెళ్తున్నారు? మా వర్క్‌షాపులో మీరిచ్చి వెళ్లిన మీ కారు రిపేర్లు పూర్తి అయాయి. సర్వీసింగ్ అయింది. గాసూ గాలీ నింపాము. మెకానిక్కి పని జాస్తీగా వున్నది. నేనే మీ గారేజ్‌లో వుంచి వద్దామని బయలుదేరాను. మీరు కామెన్‌మాన్ అనిపించుకోవాలని , ఒంటెద్దు బండిలో గూడా వెళ్తారని గుర్తు వచ్చి, నాకే అవమానమని బయలుదేరాను'' అని చెప్తూ నవ్వుతున్నది రమణి.

''నా ఫ్రెండ్ వైఫ్‌ని నర్సింగ్‌హోమ్ నాకు బాగా తెలిసినదాంట్లో అడ్మిట్ చేసి, డాక్టరు చెప్పిన మందులు బ్రెడ్, పాలూ, కాఫీ ఫ్లాస్కుల్లో పోసి వుంచి, షెల్ఫ్‌లో వుంచి వచ్చాము. వాడికి నైట్ డ్యూటీ. నన్ను దింపి పోవాలని స్కూటరెక్కమన్నాడు'' అన్నాడు.

''గుడ్ సామరిటన్ గారూ, నేను గెస్ట్ హౌస్‌కి వెళ్లాలి. నా ఫ్రెండ్ పార్టీ యిస్తున్నది. లేటైనా సరే రావల్సిందేనని ప్రామిస్ తీసుకున్నది లేడీస్ క్లబ్‌కి కొత్త సెక్రటరీని యెన్నుకున్నాము. వెళ్లిపోయే ఆమెకీ, కొత్తామెకీ గూడా కలిపి యిస్తున్నది. చివర వినోద కార్యక్రమముంటుంది. మిమ్మల్నిద్దర్నీ డ్రాప్ చేసి కారుతీసికెళ్లాలేమో'' బంక్ చూడగానే ఆపి లోపలికి తోలింది. బెంజమిన్ అనే యిరవైయ్యేళ్ల అబ్బాయి వచ్చి గాస్ పోశాడు. విక్రమ్ డబ్బు అందించాడు. చిల్లర తెచ్చి యిచ్చాడా అబ్బాయి.

''బెంజమిన్! మరో అబ్బాయికి నీ పని వదిలి వచ్చి యీ చక్రంబట్టు. నేను గెస్ట్ హౌస్‌కి వెళ్లాలి. నువ్వు వీళ్లని దింపి కారు షెడ్‌లో వుంచి తాళాలిచ్చేసి ఆటోలో బంక్‌కి రావచ్చు. యెంతా పదిహేను నిమిషాలు. యజమానికి చెప్పిరా'' అలా అంటూ డబ్బు అందించింది.

''థాంక్యూ మేడమ్. అదుగో మరో అబ్బాయి'' అని చూపాడు బెంజమిన్. గెస్ట్‌హౌస్ రాగానే రమణి దిగి గుడ్‌నైట్ చెప్పింది. సంగీత దోవ చెప్తుంటే ఆమె బిల్డింగ్ చేరి ఆపాడు బెంజమిన్. ఆమె దిగి చూస్తే త్రివిక్రమ్ దిగి, ప్యాకెట్సన్నీ తీసి పట్టుకు నిలబడి కనిపించాడు. నవ్వి కొన్ని అందుకున్నది. త్రివిక్రమ్ బెంజమిన్‌కి చెప్పాడు. కారు షెడ్‌లో వుంచి, షెడ్‌కి తాళం వేయి. కుక్

గేటు దగ్గరే వుంటాడు. కారు కీస్ ఆయనకిచ్చి పోవచ్చు బెంజమిన్'' బెంజమిన్ కారు డ్రైవ్ చేస్తూ వెళ్లిపోయాడు.

''మీరింటి కెళ్లరూ? దిగారెందుకూ?'' సంగీత అడిగింది.

''చాలా వున్నాయిసాయం పడదామని దిగాను. లిఫ్ట్ వున్నదా మెట్లెక్కాలా?''

''లిఫ్టు వున్నది'' అని దారి తీసింది.

అయిదో అంతస్తు రాగానే లిఫ్ట్ తలుపు తెరిచాడు వాచ్‌మన్. ఇద్దరూ నడిచారు. తాళం చెవిపైకి తీసి తలుపు తీసి లైటు వేసింది. లోపలికి నడిచాడు.

వన్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్ చాలా అందంగా సౌకర్యంగా వున్నది. తక్కిన లైట్లు వేసి ఫాన్లు వేసింది సంగీత. తెచ్చినవన్నీ సద్దుతుంటే అందించాడు. విజిటర్స్ రూమ్‌లో బుద్ధిగా కూచున్నాడు. అదే డ్రాయింగ్ రూమ్. గోడలకి సీతాకోక చిలకలు, పూల వాజులు పెయింటింగ్స్ చూస్తున్నాడు. ఫ్రిజ్ తీసి డ్రింక్ కలిపి గ్లాసు తెచ్చి ముందుంచింది. బెడ్ రూమ్‌లో కెళ్లి తలుపు బిగించుకున్నది. పది నిమిషాలకి వచ్చింది. ఫ్రెష్‌గా కనిపిస్తున్నది నైట్ గౌన్. కుర్చీలో కూచుంటూ అడిగింది.

'' ఇంటి కెళ్లరూ?''

'' ఒక్కత్తెవే వుంటున్నావా?'' యెదురు ప్రశ్న వేశాడు.

'' ఆ. ఆ. వుంటున్నా. మళ్లా మీరు నన్ను వెంటాడి పట్టడానికి వీలుగా వుండద్దా?''

'' ఇప్పుడు వంట చేసుకుంటావా? హెల్ప్ చేస్తా''.

''అక్కర్లా. చేసే వున్నది. వెచ్చబెట్టి తినేయటమే ఇవాళ శనివారం. రాత్రికి అన్నం తినను''.

''శనివారాలు దేనికుంటున్నావూ? వెంకన్నని పూజిస్తారా?''

''మీరు మీరే. యేం మారలేదు. క్రిందటి జన్మలో గూడా యిలాగే హాస్యాలాడుతూ, గేలిచేస్తూ నన్ను బురదలోకి లాగారు. వంటినిండా బురదయాక తెలిసింది బురదలోకి లాగారని. ఈ యెపార్ట్‌మెంట్‌లో ఒకటే పడగ్గది మీరు వెళ్లాల్సిందే'' అని కోపం తెచ్చుకున్నది సంగీత.

''పోనీ నా కాళ్లు చేతులూ నైలాన్ తాడుతో కట్టేసి నేలమీద పడుకోమను. అలాగే చేస్తా''.

''ప్లాన్ వేసే డైలాగులు వల్లించే వచ్చారన్నమాట''

''నేనేం చేయను. ఐ ప్రామిస్''

''పోనీ యీ జన్మలో నన్నా అందం డబ్బూ జాబూ వున్న దాన్ని వలవేసి పడదామనే ఆలోచన రాలేదూ?''

''నా కందమక్కర్లా. చూశావుగా అందగత్తెలనీ. వాళ్ల కళ్లు నా కోసం వెతుకుతాయి'' నవ్వుతూ అన్నాడు.

''నా కందమక్కర్లా అంటూ యిక్కడే వుండిపోవాలని చూస్తుంటే నేను అందంగా లేననే అర్థం రావటం లేదూ?

''నీకు భాష్యం చెప్పటం బాగా వచ్చు''

''మళ్లా యెందుకు జన్మించారూ? మీరు ద్వంద్వాతీతులు గదా కిందటి జన్మలో. మళ్లా వంచించాలనే ఐడియా?''

''కాదు కాంపెన్‌సేషన్ చెల్లించాలని''

''దూరంగా వుండే పరిహారం చెల్లించవచ్చుగా. నా వెంటబడటమెందుకూ?

''రక్తం ఆకర్షిస్తుంది. అదే అలా పంపుతుంది. ఈ పూట నువ్వేం తీసుకుంటావు? నేనూ అదే తీసుకుంటాను''.

తొమ్మిది దాటిందని చూసింది సంగీత. ఇష్టం లేకుండానే లేచింది.

యెలా పంపేయాలో తెలియటం లేదు. టేబిల్ మీద అన్నీ అమరుస్తుంటే వచ్చి చేతులు కడుక్కుని సాయం చేశాడు.

సూపర్ సాఫ్ట్ బ్రెడ్ స్లైసెస్ నాలుగేసి, వేడి సాంబారు వెన్న దానిలో కత్తి, అరటిపండు, పెరుగు, అమూల్ జున్ను, చిన్న కప్పుల్లో పెరుగు స్పూన్లు. మంచినీళ్లూ.

తింటూనే కవ్వించింది మళ్లా. పూర్తికాగానే క్లీన్ చేసిపెట్టాడు బల్లమీద.

దేవుడు సంగీతని కరుణించాడా అన్నట్టు యెదుటి అపార్ట్‌మెంట్‌లో వుంటున్న అమ్మాయి విరజా తలుపు తీసుకుని లోపలికొచ్చింది.

''సారీ. సంగీతా, డిస్టర్బ్ చేశానా?'' అన్నది నిలబడి.

''నాటెటాల్''

''నీ అతిథికి ఫోనొచ్చింది. రమణికి నా ఫోన్ నంబర్ తెలుసు. అక్సిడెంట్ జరిగిందట. గెస్ట్ హౌస్ మెట్లు దిగుతూ, హైహీల్సు జారి, కాలు పెణగబడి, సీల మండ దగ్గర ఫ్రాక్చరైందిట. మెట్ల మీద కార్పెట్ లేదుట. నలుగురూ సాయంపట్టి సోఫాలో వుంచారుట. విక్రమ్ బాబుని కారు తీసుకు రమ్మను. హాస్పటల్‌కెళ్లాలి. యెమర్జన్సీ అని చెప్పాలిట'' అంటున్నది.

చేతులు టవల్‌తో తుడుచుకుంటూ నిలబడివున్న త్రివిక్రమ్ అన్నాడు. ''అక్కడున్నవాళ్లకి కార్లు లేవూ. వాళ్లు తీసికెళ్లలేరూ. నా కారు పంపేశాను. నాకు డ్రైవింగ్ రాదు. డ్రైవరు బంక్ కి వెళ్లిపోయాడు''.

''నే తీసికెళ్తా రండి. పాపం రమణి మీ మీద నమ్మకముంచి ఫోన్ చేసింది. నాది సెకండ్ హాండ్ కారైనా, యెప్పుడూ ఫిట్‌గా వుంచుతాడు నా ఫ్రెండ్. అతనే నాకు డ్రైవింగ్ నేర్పి కారు కొనిపించాడు లైసెన్సు యిప్పించాడు. కారులో లోపాలు లేవన్నాడు. తను కొత్తకారు మారుతీ డీలక్సీ కొనుక్కున్నాడు. యాభైవేలు ఫియట్ అమ్మి పెట్టమని అడిగారట. అతనికీ వర్క్ షాపున్నది. రాత్రిళ్లూ పనిచేస్తారుట. దోవలో నా ఫ్రెండ్‌ని యెక్కించు కెళ్దాము. దేనికి సందేహం?'' అన్నది ధైర్యంగా.

వెనక్కి చూస్తూనే త్రివిక్రమ్ విరజా అనే స్టైనో వెంట వెళ్లాడు.

తలుపు గడియపెట్టి నిట్టూర్చి గుండెల మీద రాచుకున్నది సంగీత. ''వీడినెలాగైతేనేం పంపేశావు దేవా'' అని పండు పళం ముందుంచి వూదొత్తి వెలిగించి వెంకటేశ్వరునికి దణ్ణం పెట్టింది.

5

బస్ ఖాళీ అయింది. బస్ సిటీ బస్ కాంప్లెక్స్ చేరాలి దూసుకుపోతున్నది. కండక్టర్ రాజు సీటు మీద కూచున్నాడు. యెదురుగా త్రివిక్రమ్ కిటికీలోంచి, యెవరి కోసమో యెదురుచూస్తున్నట్టు కనిపించాడు.

''మీ సంగతేం బాగాలేదు విక్రమ్ బాబూ! అంతదుల పరించుకుపోతూ, హమేశా లడాయి వేసుకునే ఆమె కోసం మీరెదురు చూడటమెందుకు? మీరు బస్‌లో కంటబడగానే మీ మీదనించి దృష్టి మరల్చని అమ్మాయిలుంటున్నారు బస్‌లో. మీరు ఇన్‌వైట్ చేస్తే చాలు. మీ వెంటబడటానికి రెడీ, కళ్లతో నన్నా రమ్మని పిలుస్తారేమోనని ఆశగా చూస్తారు సార్!'' అని నవ్వుతూ సరసమాడాడు.

''థాంక్స్. రాజూ! నయమే. చెప్పావు. వారికి నా వునికి చెప్పావు గాదు. నివాసం చూపమని నిన్ను బ్రైబ్ చేశారేమో ఖర్మ. అపార్ట్‌మెంట్ పేరు చెప్పకు రాజూ! నేను వారితో వేగలేను'' అన్నాడు త్రివిక్రమ్.

''మిమ్మల్ని అల్లంత దూరాన చూడగానే మరో దోవన పరుగుతీసే ఆమె గూడా వీరిలాంటిదే సార్. ఆమె మిమ్మల్ని యెలా ఆకర్షిస్తున్నదోగాని, ఆమె స్పెషాలిటీ యేమిటో!'' అని నవ్వుతున్నాడు రాజు.

మెల్లిగా మాట్లాడుకుంటున్నారిద్దరూ. బస్ చప్పుడు. హారన్ చప్పుడు. యెదురుగా వచ్చే బస్సులూ, వాటి హెడ్‌లైట్లూ ఆరనూ వెలగనూ. రెండెద్దుల బళ్లూ. యెద్దుల మెడలో గజ్జెల పట్టెడ చప్పుడూ. రాత్రి పదిన్నరైంది. డ్రైవర్ ఖాదర్ భద్రంగా తోలుతున్నాడు. ఇదే లాస్ట్ ట్రిప్. ఇంటి కెళ్లాలి. పెళ్లానికి నెలలు నిండినై. తల్లి లేవలేదు. ఒకనాటు మంత్రసానికి డబ్బు చెల్లించి వాళ్లిద్దరికీ తోడుంచి వచ్చాడు డ్యూటీకి. వాళ్లిద్దరూ మాటాడేది వినాలనీ లేదు. చెవిలో

బడినా అర్థం గావటం లేదు.

''నువ్వయితే యేం చేసేవాడివి?'' అనడిగాడు త్రివిక్రమ్. రాజు నవ్వుతూ జవాబిచ్చాడు'' పొంచి వుండి అదను చూసి, వడేసిపట్టి, అందకుండా తిరుగుతున్నందుకు కసిదీరా చావబాదేవాడిని చీకట్లో. యెవరో చూసి హాస్పటల్లో చేర్పించి తమ దోవన తాము వెళ్లేవారు. యెవరైందీ చెప్పలేదు''.

''నా వుద్దేశం వేరు రాజూ. వుంచిగా స్వాధీనం చేసుకుని పరిహారమివ్వాలని చూస్తున్నా'' నిదానంగా అన్నాడు.

''దేనికండీ పరిహారం?'' ఆశ్చర్యంగా అడిగాడు రాజు!

''క్రిందటి జన్మలో చాలా పొరపాట్లు జరిగినై. తెలిసీ తెలియకా చేశాను. పొగరుమోత్తనం, వయస్సూ, స్తోమతా, అహం అలా చేయించినై. హింసలనుభవిస్తూ నన్నే అంటిపెట్టుకుని వున్నది చివరివరకూ'' అన్నాడు విచారంగా. ''అందులో విశేషమేమిటి త్రివిక్రమ బాబూ! కట్టుకున్న వాడినంటిపెట్టుకుని వుంటారు హిందూ స్త్రీలు చాలావరకంతే ''అక్కడే మొదలైంది మిస్టేక్ రాజూ. కట్టుకోటానికి అనేక అవాంతరాలూ, అడ్డంకులు, తగాయుదాలూ వచ్చాయి. నిక్కా కట్టటమనేది జరగనే లేదు'' అని తలవంచుకున్నాడు.

''కిందటి జన్మలో ఆ మతంలో పుట్టారా మీరిద్దరూ?''

''యే మతంలో పుట్టి వుంటే యేమిటి రాజూ? జహంగీర్ చక్రవర్తి, తన చిన్నప్పుడు, వయస్సు వచ్చినప్పుడు, తాను కోరిన యిద్దరికీ నిక్కా కట్టే అవకాశం కోల్పోయాడు. తండ్రి అక్బర్ ది గ్రేట్ రాజపుత్రులతో బాంధవ్యాలు నెరపి, రాజ్యానికీ కొడుక్కీ రక్షణవుంటుందని అర్థశాస్త్రం వుపయోగించాడు. రాజకీయాలు అప్లై చేస్తే సుస్థిర సామ్రాజ్యముంటుందని చూశాడు'' అన్నాడెటో చూస్తూ.

''మీ వాళ్లు మీ చేత మరొకమ్మాయికి నిక్కా కట్టించారా క్రిందటి జన్మలో? బాగా భూమి యిచ్చారా పిల్లకు?''

''వాళ్ల ఆచార ప్రకారం గ్రూమ్ నిక్కా కట్టడు. వాడివేపు ఒక వృద్ధ స్త్రీ, భర్త వున్నదీ వచ్చి బ్రైడ్‌కి నిక్కా కడుతుంది''.

''మీ మదర్ కట్టిందన్నమాట కిందటి జన్మలో. దాంతో వాళ్లిద్దరూ ఒక ముఠాగా మారి మిమ్మల్ని గుప్పెట్లో పెట్టుకున్నారా?'' అని నవ్వాడు రాజు.

కాంప్లెక్సు వచ్చేసింది. బస్ గమ్యం చేరింది. డ్రైవర్ దిగుతున్నాడు. తనకోసం కారు వచ్చిందని చూసి త్రివిక్రమ్ ౦దిగి కారువేపు వెళ్లాడు.

6

ఒక లేడీ కండక్టరు కొత్తగా డ్యూటీ లోకొచ్చింది. వాళ్లాయన కండక్టరే. బస్ ప్రమాదంలోనే డ్యూటీలో వుండగానే పోయాడు. ఆ వుద్యోగం తనకు సంక్రమించాలని పోరాటం సల్పింది వాసంతి. తాను కండక్టర్ ట్రైనింగ్ అయినట్టు సర్టిఫికేట్ ప్రొడ్యూస్ చేసింది కోర్టులో. ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లకీ చూపింది. మొరపెట్టుకున్నది వాసంతి. ఇరవై ఆరేళ్లే. ముగ్గురు పిల్లలు. అత్తా మామా తనవద్దే వున్నారు. పిల్లలు బడికి వెళ్తున్నారు. చనిపోయిన భర్త కేశవే బ్రెడ్ విన్నర్. వీరందిరినీ యెవరు పోషిస్తారు? వాసంతి గెల్చి, డ్యూటీకి వచ్చేసింది. ఆలస్యంగా అయినా జాబ్ కొట్టింది వాసంతి.

రాజూ వాసంతిని మెచ్చి థాంక్స్ చెప్పి, శలవు పెట్టి బయలుదేరాడు. మరో బస్‌లో డ్యూటీలో చేరే ముందు మంచి పిక్చర్ చూడాలి. అదీ అభిలాష.

కొత్త పిక్చర్ బాగున్నట్టున్నది. మాటనీ వేళ జనులు క్యూలో నిలబడి వున్నారు కౌంటర్ ముందు. పాములాగా వున్న క్యూ చివర వుండి రాజు పరిసరాలు చూస్తుంటే సంగీత కంటబడింది. క్యూ వదిలి ఆమె వేపు వెళ్లాడు.

''నా క్కూడా ఓ టికెట్ తెండి మేడమ్. నేనట్లా వెళ్లి యేదైనా తిని టీ తాగి వస్తాను'' ఇరవై నోటు జేబులోంచి తీసి సంగీత కందించి దణ్ణంపెట్టి వెళ్లాడు.

సంగీత టికెట్లు కొని తెచ్చే సమయానికి వచ్చేశాడు రాజు. ఇంకా తలుపులు తీయలేదు.

''మేడమ్ అక్కడ నీడన కుర్చీ వేయించా కూచోండి. గేట్ కీపర్ తెలిసినవాడే'' అని పిలుచుకెళ్లాడు. కూచున్నది. రాజు నించున్నాడు. వాల్ పోస్టర్స్ చూశారిద్దరూ. కుండీలలోని రకరకాల క్రోటన్స్ చూశారు. రాజు మెల్లిగా అడిగాడు'' మీరు త్రివిక్రమ్ బాబుని తప్పించుకు తిరుగుతారేం మేడమ్? మీ కోసం వేయి కళ్లతో యెదురు చూస్తూ వుంటారు బాబు''.

అతనికి నిజం తెలియదని సంగీతకి విచారం వేసింది.

'పైకి అలా నటిస్తారు గాని రాజూ, యిపుడు పగటిపూట యెదురుచూస్తూ అందరి కంటాబడుతున్నారు గాని క్రిందటి జన్మలో రాత్రి రెండో ఆటకి సర్కస్‌కి తీసికెళ్లి, తర్వాత తన క్వార్టర్స్‌కి తీసికెళ్లి, మూడుగంటల వేళ యింటికి పొమ్మని ఒక జట్కాలో వుంచి తోలేసేవారు. ఇలాటి ఘట్టాలు చాలా వున్నాయి. కాలేజ్ నించి వస్తుండగా కంటబడితే, నాలుగు వేపులా చూస్తూ యెవరూ తెలిసినవారు లేరని చూసి, కూడా నడుస్తుండగా ఫ్రెండ్ తారసిల్లి ''యెవరు?'' అని అడిగితే, ''పరిచితులు'' అనేవారు చాలా గుర్తు వస్తాయి వద్దనుకున్నా. చివరికంతా తారుమారై విషమించి, యింటికి కాపలా కుక్కలాగా మారాను. అంతటితో అయిపోలేదు రాజూ! ఇంట్లో పరాయి వారినీ రోగిష్టివారినీ, అతిథులుగా వుంచి, వారి పథ్యపానాదులు చూడమని కాజువల్ లీవ్ మీద వూరికి వూడాయించేవారు. అది జాండిస్ అయితే మూడునెలలుంటుంది. అల్సర్ అయితే ఆపరేషన్‌కి సిద్ధం చేయాలి. బలం పట్టించాలి. అతిథి గొప్ప వుద్యోగి అయినా, బిజినెస్ రన్ చేస్తున్న వాడైనా అసభ్యంగా బిహేవ్ చేస్తే భరించాలి. కంప్లెయింట్ చేసి లాభం లేదని ఋజువైంది రాజూ! మహారాజా అంటే మరోటి తన్నమన్నాడట. అలాగే జబ్బు మనుషులు గనక అలా బిహేవ్ చేశారని వారి పక్షమే పల్కారు రాజూ ! త్రివిక్రమబాబు తల్లిదండ్రులు బాగా వూహించే ఆ పేరు పెట్టారాయనకి త్రివిక్రముడు భువనత్రయం గెలిచి తన అన్న యింద్రునికి ధారదత్తం చేశాడు. భువనత్రయంలో భూమి అనగా భూదేవి వున్నది. తాను గెలిచి తెచ్చుకున్న స్త్రీని గూడా యిచ్చేశాడన్న మాట. ఈ త్రివిక్రమ బాబు గూడా అంతే రాజూ! సంపాయించుకున్నవిస్తూ నిద్రలో గూడా అన్న అని కలవరిస్తూ, చివరికెంత

విశాలహృదయం చూపాడంటే రాజూ, నిక్కా గూడా కట్టకుండా తెచ్చి, కాపలా మనిషిగా మార్చిన స్త్రీని, యే అధికారం లేనిదాన్ని ధారాదత్తం చేయాలని పథకం వేశాడు. అదే బెడిసికొట్టింది రాజూ! ప్రతీ దానికీ హద్దున్నది. నీ కళ్లను నీవు నమ్మకు. నా కళ్లే నన్ను మోసగించాయి. నీకు చేతనైతే త్రివిక్రమబాబు చొరవ, పంతం తీవ్రరూపం దాల్చకుండా చేయి. నీవు సోదరునిలాగా నా సొద వినాలని నిలబడి వున్నావు. మీరిద్దరూ యేకమైనా నన్నీ జన్మలో పట్టలేరు సుమా''.

రాజు నివ్వెరపోయి నిలబడి పోయాడు. తెలివి వచ్చి చూస్తే తలుపులు తీయటం జనం లోపలికి పోవటం, కంటబడింది. కుర్చీలో లేదు. వారితో కలిసి లోపలికి పోయి వుండాలి.

7

టౌన్లో అల్లర్లు జరుగుతున్నాయి. అల్లరిమూక, ఆకతాయిలూ విజృంభించారు. దురంతాలు, దారుణాలు, ఆస్తి నష్టం. అవమానాలు, సిటీ బస్‌ల మీద దాడిచేస్తారేమోనని డ్రైవర్లూ కండక్టర్లూ భయపడుతూ జాగర్తలో వున్నారు. రూట్లు మార్చి, గమ్యం చేరి షెల్టర్లో వుంచేస్తున్నారు వాహనాన్ని అయినా అప్పుడే రెండు సిటీ బస్సుల మీద దాడి జరిగింది. బెదిరిన ప్రయాణీకులు దిగిపోయారు. బస్ అంటుకున్నది. పోలీసుశాఖ రంగంలోకి దిగింది. టియర్ గాస్ వాడారు. గాలిలో పేల్పులు జరిగాయి.

పక్క సందుగుండా బస్ పోతున్నది. రాజు బస్ హేండిల్ పట్టుకుని బస్‌లోకి యెక్కగలిగాడు. జనాన్ని నెట్టుకుంటూ వెళ్లి డ్రైవర్ని కలుసుకుని, ''ఆ మెయిన్ రోడ్డు మీద అల్లర్లు మొదలైనై, మరో వేపుగా వెళ్లి గమ్యం చేరాలి. ఇవాల్టికి విధి నిర్వహణ ఆపితే బావుంటుంది బస్‌ని సేఫ్టీ ప్లేస్‌లో దాచాలి'' అని చెపుదామని, కిక్కిరిసివున్న ప్రయాణీకులను నెట్టుతున్నాడు. కొంతమంది రక్షణకోసం యెక్కితే, కొంతమంది పారిపోవాలని యెక్కితే మరికొంతమంది అల్లర్లు కళ్లారా చూడాలని యెక్కారు.

యెలాగైతేనేం చక్రం దగ్గరకి చేరగలిగాడు రాజు. డ్రైవరుతో చెప్పాడు గూడాను.

''అసలెలా మొదలైంది?'' డ్రైవరడిగాడు.

''గోడల మీదా కొండరాళ్ల మీదా, తిట్టుతూ దూషిస్తూ గుట్టు బయటపెడుతూ, తప్పులెన్నుతూ పెద్ద అక్షరాలతో చాక్‌పీసుతో వ్రాశారు. ఒక ముఠా వారు, ప్రత్యర్థులు వాటిని చదివి అంతకంటె ఘాటుగా వ్రాసి యింకా రహస్యాలు బైటబెట్టారు. పొంచి వుండి మీద బడ్డారు. తొమ్మిదింటికి దొమ్మీ మొదలైంది. గలాటా, అల్లరి, తర్వాత పెద్ద సైజు యుద్ధం. మనం కనీసం బస్సునన్నా కాపాడాలి''.

సరీగ్గా అప్పుడే బస్సులోనే గడబిడా కలకలం బయలుదేరాయి. ''నిన్ను పట్టి తీరుతా. తప్పించుకోలేవు నన్ను. బాణాసురుని కున్నట్టు, సహస్రార్జునికున్నట్టు నాకు వేయి చేతులున్నాయి తెలుసా. నువ్వు మర్యాదగా లొంగి పోవాల్సిందే. అదే శ్రేయస్కరం'' అంటున్నాడు త్రివిక్రమ్.

''యెన్ని చేతులున్నా బుద్ధి లేనప్పుడేం లాభం త్రివిక్రమ్ బాబూ? నీవు నీవేనని నీవే ఋజువు చేశావు. క్రిందటి జన్మలో గూడా యిలాగే కనులెర్రజేసి హూంకరిస్తూ, కోర్టింగ్ బిగిన్ చేశావు త్రివిక్రమ్ బాబూ! ఇంకా యేమన్నావంటే, చేతగాని వెధవనుకున్నావా? చెప్పకుండా చిన్న యింట్లోకి మారావు యెందుకూ? నీ యిబ్బందేమిటో నాతో చెప్పక్కర్లేదూ? నేను నీ కోసం అయిదంతస్తుల భవనంలో మంచి అపార్ట్‌మెంట్, మంచి పరిసరాలున్నచోట బయానా యిచ్చి వస్తినే గొప్ప తెలివా అదీ? అన్నావు త్రివిక్రమబాబూ. ప్రేమతోనే అలా కనులెర్రజేశానని నమ్మమంటావు. అది డామినేషనే. బాణాసురుని వేయి చేతులూ, రెండు మాత్రం దయతో వుండనిచ్చి, కృష్ణపరమాత్మ తన చక్రంతో తురిమేశాడు. సహస్రార్జునుని వేయి చేతులే కాక తల గూడా తన పరశువుతో నరికేశాడు భార్గవరాముడు. నియంతలో ప్రేమ వుండదు. అది నటన. హిట్లర్ జనరల్సే అలా అన్నారు. ''వాడికి తన దేశం మీదా లేదు, దేశీయుల మీదా లేదు. హి యీజ్ పవర్ క్రేజీ. మనిషిని అన్నివిధాలా అణిచి వుంచటం, మానవహక్కుల పరిరక్షణ కిందికి వస్తుందా? నీ నవ్వు వెనక, డబ్బు వెనక, అందం వెనకా దాచివుంచిన సంకెలలు నాకక్కర్లేదు. కుక్కకి చల్లాన్నం వేసినట్టు

వేసి చాలామందిని నెత్తికెక్కించావు. బ్రహ్మరథం పట్టించావు. ఈ జన్మలో నాకు సంపూర్ణ స్వాతంత్ర్యమే కావాలి. దానిననుభవిద్దామనే మళ్లా జన్మనెత్తాను. అందుకే క్రితం జన్మలో నీవు శ్రీశైలం చూసి రమ్మని యెవరి వాహనంలో ఇరికించి కూచోబెట్ట చూసినా వెళ్లలేదు. శ్రీశైల శిఖరం చూసిన వారికి పునర్జన్మ వుండదని ఒక నమ్మకమున్నది. నేను జన్మపరంపర చేత సాధించదలచినవి వున్నాయి. వాటిలో ముఖ్యమైనది నీ రోగం కుదర్చాలనేది. ఆ రోగమేమనగా నీకు లోబడి ఆశ్రయించుకుని వుండాలి అని. నన్ను ముట్టుకోకు. నా కొంగు తాకకు. నా వెంటబడకు. మనిషిని వాడుకున్నన్నాళ్లు వాడుకుని మరొకరికిచ్చేయాలనే నీ ఐడియా గూడా బాగా లేదు. ఆవుకు యీతలయాక, దానిని కబేళాకు తోలినట్టు తోలేసేయాలనేదే నీ ఐడియా'' ఉరుములు మెరుపులలాగా వున్నాయి సంగీత మాటలు. స్త్రీ జనం సంగీతపక్షం. పురుషులు త్రివిక్రమ్ పక్షమైనారు. గొంతులు పెద్దవైనాయి. చేతులు రంగంలోకి దిగాలని ఆతృతగా వున్నాయి.

త్రివిక్రమ్ సంగీతను, గద్ద పావురాన్ని పట్టబోయినట్టు పట్టబోయాడు. జనాన్ని తోసేస్తూ పిట్టలాగా తుర్రున పారిపోయింది సంగీత. బస్ ఫుట్ బోర్డ్ మీదినించి దూకి పరుగందుకున్నది. మబ్బు రంగు మైసూర్ జార్జెట్ సిల్క్ చీర కొంగుగాలిలో కెగిరింది. వాన రాబోతున్నదా అన్నట్టు చల్లని గాలి వీచసాగింది. ఆమె జాకెట్టు మబ్బు తునకలాగా మెరిసింది. చెమటకి తడిసి నల్లని మబ్బులాగా జలధరంలాగా కనిపించింది. జరీఅంచులు తటిల్లతలలాగా తోచినై. జుట్టు ముడి వీడి నల్లని జుట్టుపట్టులాగా కనబడుతూ నదీమతల్లిలాగా పరుగెత్తి పోతున్న నీలిమేఘం లాగా దట్టంగా కనబడింది.

''పట్టుకోండి. పట్టుకోండి. క్రితం జన్మలో నిక్కా కట్టకపోతేనేం, సంతానాన్నిచ్చానా? పెంచుకున్నధి. ఆ స్త్రీ నాదే'' త్రివిక్రమ్ గూడా జనాన్ని తోసేస్తూ బస్ దూకి వెళ్లి పరుగెత్తాడు సంగీత వెంట.

బస్ మెల్లిగా మలుపు దిరిగి కూడలిలో కొచ్చి ఆగింది. దుండగులు, తుంటరులు, ఆకతాయిలూ, సంఘవిద్రోహులు పిడబ్ల్యుజి అనే ముసుగులు వేసుకుని బస్ ముట్టించి, లోపలి వారిని లూట్ చేయాలని పరుగెత్తు కొచ్చారు.

రాజూ, డ్రైవరూ దిగి, ప్రయాణీకులను శాంతపరుస్తూ ధైర్యం చెబుతూ వెనక్కి పంపాలని ప్రయత్నిస్తున్నారు. కాని జనం భయపడిపోయి పారిపోవాలని చూస్తూ కిందబడ్డారు. వారిని తొక్కుకుతూ మరికొంతమంది దిగి వెళ్లారు.

రాజూ, డ్రైవర్ బెంజమిన్ దుండగులను శాంతపరచాలని ఆపివేయాలనీ, బస్ కాపాడాలని ట్రై చేస్తున్నారు.

''సిటీ బస్ అనేది ప్రజాధనం. మీ సొత్తే. మీ ఆస్తి మీరే పాడుజేసుకుంటారా? బస్ ధ్వంసం చేయరాదు. అది భృతినిస్తుంది'' అని నెట్టేస్తున్నారు.

రాజు, సంగీతా త్రివిక్రమ్ పరుగెత్తిన వేపు చూశాడు. చేతులు పైకెత్తాడు. నోరు దెరిచాడు. కళ్లు చాలా పెద్దవై మెరిసినై. జనం నెట్టగా వెల్లకిలా పడిపోయాడు.

విమానం టేకాఫ్ తీసుకుంటున్నట్టున్న దృశ్యం

'' ఈ జన్మలో నీకు పరిహారం చెల్లించాలని పుట్టాను సంగీతా. రా. రా. నన్ను నమ్ము. చేతల ద్వారా ఋజువు చేస్తా మాటల ద్వారా గాదు'' అని ఆయాసపడుతూ సంగీతను పట్టుకోవాలని పరుగెత్తాడు త్రివిక్రమ్.

పరిపూర్ణ వేగశక్తిని అందుకున్న వాయునౌకలాగా సంగీత ఆకాశంలో కెగిరింది. ''రాను, రాను, నిన్ను నమ్మను త్రివిక్రమ్ బాబూ. త్రివిక్రముని లాగే నీవూ మాయలు నేర్చావు. నా స్వేచ్ఛ నాకు అమూల్యమైనది. కిందటి జన్మలో దాన్ని కోల్పోయి యూస్‌లెస్ అయాను. ఐ వాంట్ టు లీడ్ మై వోన్ లైఫ్. నీ బండి నువే లాక్కో. అందుకే భూమి మీద పుట్టుకే విలువైనది అని కైవల్యం త్యజించి పుట్టాను'' అని మబ్బు కన్నెలాగా వినీలాకాశంలోకి దూసుకుపోయింది. ఆమెకు సాయంగా మరికొన్ని మబ్బులు ఆమె పక్కన పరుగెత్తాయి.

త్రివిక్రమ్ క్రమంగా నీరసించి జాలిగా పిలుస్తూ తానూ పైకెగశాడు. అదే కోరికతో పరుగెత్తాడు. అతని నల్లని బూట్లూ, నల్లని క్రాపూ, నల్లని సూటూ,

చెదిరిన కోటులో నించి తెల్లని షర్టూ, మెరిసే బొత్తాలూ కనబడుతూనే వున్నాయి రాజుకి. కొన్ని నీలిమేఘాలు త్రివిక్రమ్‌కి తోడుగా పరుగెత్తుతున్నాయి. త్రివిక్రమ్‌కి కన్నీళ్లు వచ్చాయి. దట్టమైన మబ్బులూ సానుభూతి చూపుతూ చినుకులు వదిలాయి. చల్లదనాన్నిస్తూ గాలీ వానా మొదలైనాయి. రాజుకి త్రివిక్రమ్, సంగీతా మబ్బులడ్డు రావటం వల్ల కనబడటం లేదు రాజుకి.

బస్ దగ్గరున్న వారంతా చేతులడ్డం పెట్టుకుంటూ రాజు చూసే వేపే, అతని చేతుల చివరలు చూపుతున్నవేపే చూశారు. వారికేమీ కనబడలేదు అర్ధమూ గాలేదు.

డ్రైవర్ బెంజమిన్ నెత్తి మీద బడే వానతో బాటు నిజమైన కన్నీళ్లు గూడా రాజుమీద రాలుస్తూ రాజు చేతులు నేలమీదుంచి అతని పెద్ద కళ్లు మూశాడు.

నిలబడి చూస్తే మెరుపులు గాలి వానా వచ్చి విధ్వంసకులకు అవకాశమివ్వకుండా వురిమి భయపెట్టి చెల్లా చెదురు చేశాయి. షెల్టర్ కోసం పరుగెత్తుతూ జనం రెండు పెద్ద మెరుపులు వచ్చి కళ్లు మిరుమిట్లు గొలపటం చూశారు. చెవులు చిల్లులు పడే వురుములు విన్నారు.